# మినీకథ

## తగిన శాస్తి!

ఎ. రంగ



"ఏమండీ! అబ్బాయి ఆఫీసుకు వెళ్ళేటప్పుడు ఫేన్ శుభ్రం చేయించమని మరీమరీ చెప్పి వెళ్ళేడండి! 'వేసుకోవటమే కానిశుభ్రం చేయించడం తెలీదా?' అంటూ ఎగిరెగిరి వెళ్ళేడు. ఓ మారు ఆఫీసుకు వెళ్ళి ఎలక్ట్రిషియన్‌ని రమ్మనండి. కాస్తంత శుభ్రంచేసి పెడతాడు" అంది శేషమ్మగారు భర్త వరంధామయ్యగారితో.

"ఏదైనా రిపేరువుండి చెయ్యమని చెప్తే 'డ్యూటీ'లో వుంటే వస్తాంకాని మన సొంత పనికి పిలిస్తే రారు. మనమే శుభ్రం చేసుకోవాలికాని".... అన్నారు వరంధామయ్యగారు. "సరే! ఆ ఫేను విప్పటాలు, బిగించటాలు వస్తే లేనిదేముంది? సొంతపనయినా ఫరవాలేదు. కాఫీకి టిఫిన్‌కి డబ్బులిస్తామని బతిమాలుకుంటే వాళ్ళే వస్తారు. ఒక్క ఘడీ చేసిపోతారు. ఏ భోజనానికో వెళుతున్నపుడు పిలవండి. ఎవరో ఊరు రాకపోరు." అంది బతిమాలుతున్న ధోరణిలో. శేషమ్మగారు.

"అలాగే పిలుస్తాను. పిలవటానికి నా అభ్యంతరం ఏమీలేదు. వచ్చి చేస్తే చేస్తారు. లేకపోతే లేదు. రెండు రూపాయలు సిద్ధంగా మాత్రం ఉంచుకో!" అన్నారు వరంధామయ్యగారు.

"ఇది మరీ బాగుంది. నాదగ్గర ఏమీ లేవు. నెలాఖరు కూడాను! బదులిచ్చే శాంతమ్మ పెళ్ళికి వెళ్ళిపోయింది. పక్కింటి సావిత్రమ్మ పొరపాటున కూడా పైసా అప్పు ఇవ్వదు. ఇచ్చినా పీకమీద కూర్చుంటుంది. మీ దగ్గరుంటే ఇవ్వండి" అంది దబాయింపుగా. శేషమ్మగారు.

"ఉంటే ఎందుకివ్వనే! శాంతమ్మగారు ఇవ్వకపోతే. మరో బామ్మగారి దగ్గర పట్రా తర్వాత ఇచ్చేద్దాం" అంటూ వరంధామయ్యగారు గింజుకున్నారు.

"సరే! వెళ్ళండి. వెళ్ళి పిలుచుకురండి. అలాగే బామ్మగారిని అడిగి తెస్తాను. తప్పుతుందా మరి" విసుక్కుంటూ అంది శేషమ్మగారు.

వరంధామయ్యగారు వాలుకుర్చీలోంచిలేచి డైరీని శ్రద్ధగా పెట్టెలో పెట్టి తాళం కప్పు తగిలించి కుర్చీ ఎత్తేసి వీధిలోకి వెళ్ళేరు ఎలక్ట్రీషియన్‌ని పిలవటానికి

ఆయన వీధిలోకి వెళ్ళగానే శేషమ్మగారు వీధి తలుపులు వేసి. ఆయన పెట్టె తెరచి డైరీతీసి. డైరీ చూసింది ఏదో అనుమానం రాగా! మధ్య పేజీలలో మడతపెట్టిన వది రూపాయల నోటు ఒకటి. రెండు రూపాయల నోట్లు ఐదు. మొత్తం 20 రూపాయలు జాగ్రత్తగా మడతపెట్టి దాచబడి వున్నాయి. శేషమ్మగారికి ఒళ్ళు మండిపోయింది ఒక్కసారి. వెంటనేరెండురూపాయల నోటు ఒకటి తీసి మిగతావి యధాతథంగా వుంచేసి డైరీ మూసేసి. పెట్టెలో పెట్టేసి కప్పు తగిలించేసింది. తీసిన రెండు రూపాయలూ మాత్రం కొంగున ముడేసుకుంది.

మరో గంటలో ఎలక్ట్రీషియన్ రావటం ఫేను విప్పి శుభ్రం చేయటం. మళ్ళా బిగించటం కూడా జరిగిపోయింది. ఎలక్ట్రీషియన్ తిరిగి వెళ్ళిపోతున్నప్పుడు పిలిచి రెండు రూపాయల నోటు చేతిలో పెడుతూ-

"కాఫీ తాగు నాయనా! పిలవగానే వచ్చేవు" అంది శేషమ్మగారు కృతజ్ఞతగా!

"వద్దండీ...." అతను మొహమాటపడిపోయేడు.

"పెద్దదాన్ని చెపుతున్నాను ఏదోనాళక్కి కొలదీ ఇచ్చేను సంతోషంగా తీసుకో!" అంటూ బలవంతపెట్టగానే ఎలక్ట్రీషియన్ ఆ రెండు రూపాయలు తీసుకుని వెళ్ళిపోయేడు.

అతను వెళ్ళిపోయాక "నేనీ రెండు రూపాయలు బామ్మగారిని అడిగి తెచ్చాను. అడగ్గానే ఇచ్చింది. మనం వెంటనే ఇచ్చేస్తేనే బాగుంటుంది. మర్యాదగా! ఎలాగో అలా తెచ్చి ఇచ్చేయండి ఆ రెండు రూపాయలు. బదులు తీర్చేస్తాను. అది మీరు పడుకునే గదిలో మీరు వేసుకునే ఫాను." అతని బాధ్యతని గుర్తు చేస్తూ అంది శేషమ్మగారు ఒత్తిడిగా.

ఇక ఆవిడ ఎలాగ ఊరుకోదు. సాధించిపోస్తుంది ఈ రెండు రూపాయలకోసం బతకనివ్వదు. డైరీలోంచి రెండు రూపాయలు తీసి ఇచ్చేస్తే ఆవిడపోరు వదిలిపోతుంది అనుకుంటూ పెట్టె తీసి డైరీని తీసేరు. రెండురూపాయలు గల్లంతు "రెండు రూపాయలు తీసేవా డైరీలోంచి?" గట్టిగా అడగబోయి- చటుక్కున దొంగకి తేలుకుట్టినట్లు అయి నోరు నొక్కేసుకుని. మరో రెండు రూపాయలు నోటు తీసి శేషమ్మగారికిస్తూ—

"ఇందాక రాఘవయ్యగారి దగ్గర అడిగి తీసుకున్నాను నీ పోరు పడలేక" అంటూ అందించేరు. పచ్చివెలక్కాయ గొంతులో అడ్డుపడినట్లయింది ఆయనకి.

"రెండు రూపాయలకోసం చూసుకుంటే మాయలమారి మొగుడికి నాలుగు రూపాయలు లాస్. తగిన శాస్తి జరిగింది. అనుకుంటూ కసితీర ఆనందించింది లోలోపల శేషమ్మగారు. ●

